క్లుప్తంగా

బాక్సింగ్ శిక్షణ శిబిరం సందర్శన



బాక్సింగ్ శిక్షణను పరిశీలిస్తున్న సంపంగి శ్రీనివాసరావు

సీతంపేట: సత్యం సెంటర్ కూడలి వద్ద గ్రీన్‌బెల్ట్‌లో హనుమాన్ బాక్సింగ్ క్లబ్ ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు సందర్శించారు. బాక్సింగ్ కోచ్‌లతో మాట్లాడి శిక్షణ ఏ విధంగా సాగుతోంది పరిశీలించారు. వేసవి సెలవుల్లో పిల్లలకు బాక్సింగ్‌లో మెళకువలు నేర్పించాలని సూచించారు. బాక్సింగ్ వల్ల శారీరక ధారుఢ్యంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతాయన్నారు. పిల్లలు బాక్సింగ్ నేర్చుకుని భవిష్యత్‌లో మంచి క్రీడాకారులుగా రాణించాలని ఆకాంక్షించారు.

'స్పందన'కు 20 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్

సీతమ్మధార: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్ల శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రవి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

'జోన్-5'కు ఆరు వినతులు



స్పందన వినతులు పరిశీలిస్తున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ వినతులు స్వీకరించారు. జీవీఎంసీ 40వవార్డు నుంచి 63వ వార్డులకు సంబంధించి నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 06 వినతులు అందాయి. వాటిలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 02, రెవెన్యూ విభాగానికి 02, యూసీడీ విభాగానికి 02 వినతులు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు జెడ్సీ సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1, 2 టీఎస్ఎస్ రాజు, ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వో బాబూరావు, ఈఈలు శ్రీనివాసరావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ డీఈ శ్రీనివాసవర్మ, టౌన్‌ప్లానింగ్ టీపీవో ఎం.శ్రీలక్ష్మి, అపరంజిత, ఏపీడీ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

జోన్-5 ఏపీడీగా శైలజ బాధ్యతల స్వీకరణ



విధుల్లో చేరిన ఏపీడీ శైలజ, సీడీవోలతో జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 యూసీడీ ఏపీడీగా శైలజ సోమవారం బాధ్యతలు చేపట్టారు. జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణకు ఆమె తన నియామక పత్రాన్ని అందజేశారు. శైలజతోపాటు కమ్యూనిటీ ఆర్గనైజర్లుగా జోన్-5కు 16 మందిని జీవీఎంసీ ప్రాజెక్ట్ అధికారి నియమించడంతో వారంతా విధుల్లో చేరారు. జోన్-5 పరిధిలోని 24 వార్డుల్లో సీడీవోలను నియమించనున్నట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు.

నిలువ నీడ కరువాయె..!

- హైవేపై అనుకూలంగా లేని బస్ షెల్టర్లు
- మండుటెండలో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



బిర్లా జంక్షన్‌లో నిరుపయోగంగా బస్ షెల్టర్



ఎండలో హైవే డివైడర్‌పై బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

మురళీనగర్: అసలే వేసవి కాలం.. ఆపై మండుతున్న ఎండలు.. వెరసి రోడ్లపై నీడ కరువై ప్రయాణికులు అల్లాడుతున్నారు. జాతీయ రహదారిపై ఎండలోనే బస్సుల కోసం అవస్థ పడుతూ వేచి ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. ఎన్ఏడీ-కంచరపాలెం హైవేను అనుకుని అనేక సంస్థలు, ఇండస్ట్రియల్ ఎస్టేట్, విద్యా సంస్థలు ఉన్నాయి. నిరంతరం విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు ఈ ప్రాంతానికి దూరప్రాంతాల నుంచి వస్తుంటారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు జాతీయ రహదారిపై బస్సుల కోసం వారంతా వేచి ఉంటారు. బస్ షెల్టర్లు అనుకూలంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

సర్వీస్ రోడ్డులో నిరుపయోగంగా..

జాతీయ రహదారిలో మర్రిపాలెం కూడలి నుంచి సర్వీస్ రోడ్లు ప్రారంభమవుతాయి. వీటిలో రెండువైపులా బస్ షెల్టర్లు ఉన్నాయి. వీటిలో కొన్ని దాతలు నిర్మించగా.. మరికొన్నింటిని ఆర్టీసీ నిర్మించింది. అయితే ఇవి ప్రయాణికులకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. బస్ షెల్టర్లు బాగానే ఉన్నా.. బస్సులు మాత్రం అవి ఉన్న మార్గంలో ఆగడం లేదు. దీంతో షెల్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇవి కేవలం చిరువ్యాపారులు, ఇతర పాదచారులు విశ్రాంతి తీసుకోవడానికే ఉపయోగపడుతున్నాయి.

ఆరుబయటే నిరీక్షణ..

సర్వీస్ రోడ్డులో బస్ షెల్టర్లు ఉండటంతో ప్రయాణికులు బస్సుల కోసం జాతీయ రహదారి డివైడర్లపై నిరీక్షించాల్సి వస్తోంది. కొన్ని చోట్ల డివైడర్లపై ఉన్న మొక్కల నీడ వీరికి ఆశ్రయం ఇస్తోంది. చాలా చోట్ల ఆరుబయట ఎండావానల్లో నిరీక్షించాల్సి వస్తోంది. జాతీయ రహదారిని అనుకుని పాలిటెక్నిక్ కాలేజీలు, ఐటీఐలు, ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, కార్ల షోరూమ్‌లు, షాపింగ్ కాంప్లెక్సులు ఉన్నాయి. ఇండస్ట్రియల్ ఎస్టేట్ కూడా సర్వీస్ రోడ్డును అనుకుని ఉంది. వందలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, నగరంలోకి వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం ఆరుబయట వేచి ఉంటున్నారు. ప్రస్తుతం ఎండా కాలం ఉష్ణోగ్రతలు పైపైకి పోతున్నాయి. వడగాడ్పులకు తోడు ఆరుబయట ఎండలో నిరీక్షణ ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తోంది. డివైడర్ల వద్ద కనీసం తలదాచుకోవడానికి ఏర్పాట్లు లేవు. దీనిపై ఆర్టీసీ, జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎండలు మండిపోతున్నాయి



ఎండలు మండిపోతున్నా.. బస్సుల కోసం ఆరుబయట వేచి ఉండాల్సి వస్తోంది. దశాబ్ద కాలంగా ప్రయాణికులు ఇలాగే ఇబ్బందులు పడుతున్నారు. బస్ షెల్టర్లలో ఉందామంటే ఆర్టీసీ బస్సులు ఆగవు. చేసేదేం లేక డివైడర్లపై బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది.

– ఎల్‌సీహెచ్ నాయుడు, కైలాసపురం

బీఆర్‌టీఎస్ తరహాలో షెల్టర్లు అవసరం



పెందుర్తి-జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ రహదారిలో మాదిరిగా బస్ షెల్టర్లు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం ఉన్న డివైడర్లను వెడల్పు చేసి ప్రయాణికులు వేచి ఉండడానికి వీలుగా మినీ షెల్టర్లు నిర్మించాలి. ఆర్టీసీ, జీవీఎంసీ అధికారులు తగు చర్యలు చేపట్టాలి.

– కోన భవానీశంకర్, మురళీనగర్

క్లాప్ వాహనాల డ్రైవర్ల నిరసన



నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

మర్రిపాలెం: జీవీఎంసీ పారిశుధ్య విభాగం క్లాప్ వాహనాల డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు సోమవారం 53వ వార్డు మర్రిపాలెం ఆంధ్రకేసరి నగర్ శ్మశానవాటిక వద్ద నిలిపి ఉన్న క్లాప్ వాహనాల వద్ద నిరసన చేపట్టారు. తమకు కనీస జీతం రూ.18,500 ఇవ్వాలని, 2021లో విధుల్లోకి తీసుకున్న జీవీఎంసీ అధికారులు భవిష్యత్తులో రూ.18,500 చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇంతకాలం గడుస్తున్నా తమకు రూ.11 వేల మాత్రమే ఇస్తున్నారన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. క్లాప్ వాహనాలు రోజూ 31 కిలోమీటర్లు తిరగాలన్న అధికారులు.. ప్రస్తుతం కిలోమీటర్ల దూరాన్ని పెంచారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

'ప్రచార భేరి' సభను జయప్రదం చేద్దాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కంచరపాలెం: సీపీఎం కంచరపాలెం జోన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రైతుబజార్ వద్ద ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు ఒమ్మి అప్పారావు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించి దేశాన్ని కాపాడాలనే నినాదంతో ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఈ నెల 26న విశాఖ స్టీల్‌ప్లాంట్ కూర్మన్నపాలెం గేటు దగ్గర నిర్వహించే బహిరంగ సభలో సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యుడు, బీవీ రాఘువులు, సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు నారాయణ పాల్గొంటున్నారని చెప్పారు. ప్రజలందరూ తరలివచ్చి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.ఈశ్వరరావు, పి.పూర్ణ, వరలక్ష్మి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముత్యమాంబ జాతరకు ఏర్పాట్లు

- 19న తొలేళ్లు, 20న ప్రధాన పండగ
- ముస్తాబవుతున్న ఆలయం





రంగులద్దుకుంటున్న ఆలయ గోపురం

కంచరపాలెం: కంచరపాలెం కూడలిలో కొలువైన ముత్యమాంబ అమ్మవారి వార్షిక నవరాత్రి జాతర మహోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ నెల 19న తొలేళ్ల సంబరంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు, పుట్టబంగారం ఆలయం వద్ద పూజాధికాలు జరపనున్నారు. 20వ తేదీన ప్రధాన పండగ, 27వ తేదీన అమ్మవారి మారువారం జాతర, అన్నదానం నిర్వహించనున్నట్లు గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘ సభ్యులు తెలిపారు. ఆలయ పరిసరాలు, గాలి గోపురాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. సాంస్కృతిక, నృత్య కార్యక్రమాల నిర్వహణకు వేదికలను, విద్యుత్ దీపాలంకరణలు సిద్ధం చేస్తున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

రోల్ మోడల్‌గా యువత



ప్రసంగిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: భవిష్యత్తు తరానికి ప్రస్తుత యువత రోల్ మోడల్‌గా నిలవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో సోమవారం నిర్వహించిన ఐఏఎస్ఈ ఫ్రెషర్స్ డే వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భావితరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులుగా విద్యార్థులు మారాలని సూచించారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలకు వీసీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

25న శ్రీశ్రీపై క్విజ్ పోటీ

సీతంపేట: శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఈ నెల 25వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శ్రీశ్రీ జీవితం, సమగ్ర సాహిత్యంపై క్విజ్ పోటీ నిర్వహించనున్నట్టు విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాత పరీక్ష ఉంటుందని, వన్ వర్డ్ ఆన్సర్స్ రూపంలో రాయాల్సి ఉంటుందన్నారు. 30 ఏళ్ల లోపు వారు(జూనియర్స్) ఒక విభాగం గాను, ఆపై వయస్సు ఉన్నవారు (సీనియర్స్) మరో విభాగం గాను పోటీ జరుగుతుందని చెప్పారు. రెండు విభాగాలకు విడివిడిగా ప్రథమ బహుమతి రూ.1,000, ద్వితీయ బహుమతి రూ.750 ప్రదానం చేస్తామన్నారు. ఈ నెల 30న ఆంకోశాలో జరగనున్న శ్రీశ్రీ జయంతి వేడుకల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. పోటీలో పాల్గొన దలచిన వారు వారి పేర్లను వాట్సాప్ ద్వారా ఈ నెల 20లోగా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. డాక్టర్ డి.వి.సూర్యారావు 98851 88431, మేడా మస్తాన్‌రెడ్డి 94413 44365 నంబర్లకు వాట్సాప్ చేయాలని కోరారు.

ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో కొత్త కుర్చీల ఏర్పాటు



స్టేషన్ ఆవరణలో కొత్త కుర్చీలు

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార: స్థానిక ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో కొత్త ఇనుప కుర్చీలు ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడున్న కుర్చీలు పాడై మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు కూర్చునేందుకు ఇబ్బంది పడేవారు. ఈ సమస్యపై ఈ నెల 16న 'ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో పాడైన కుర్చీలు' అనే శీర్షికన 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొత్త కుర్చీల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఫిర్యాదుదారులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు కుంచుమాంబ పండగ



గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెం కుంచుమాంబ అమ్మవారి పండగ మంగళవారం నిర్వహించనున్నారు. సోమవారం తొలేళ్ల సంబరం, అమ్మవారి ఘటాల ఊరేగింపు వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు రానున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ముస్లింలకు ఇఫ్తార్ విందు పార్సిళ్లు అందిస్తున్న కార్పొరేటర్ అల్ల లీలావతి

తాటిచెట్లపాలెం: రంజాన్ మాసం సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ సహకారంతో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ మసీదు వీధిలోని మసీదు వద్ద సోమవారం సాయంత్రం ముస్లింలకు కార్పొరేటర్ అల్ల లీలావతి శ్రీనివాస్ చేతుల మీదుగా ఇఫ్తార్ విందు పార్సిళ్లను అందజేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాల అమలు



బిలాల్ కాలనీలోని ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



51వ వార్డులో కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

సీతమ్మధార: పార్టీలకతీతంగా.. నిష్పక్షపాతంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి నియోజకవర్గ పరిధి బిలాల్ కాలనీ, ఏఎస్సార్ నగర్ కొండవాలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్తు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజాభిప్రాయాలు సేకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నివాసుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు ఇంటింటా అతికించి, ప్రభుత్వ పాలన క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత టీడీపీ పాలనంతా అవినీతిమయమని, సంక్షేమ పథకాలపై ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. నాలుగేళ్ల పాలనలో మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీల్లో 98.5 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని కొనియాడారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జోరుగా 'జగనన్నే మా భవిష్యత్తు'

మర్రిపాలెం: జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జోరుగా సాగుతోంది. సోమవారం 51వ వార్డు 289 సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, సచివాలయం కన్వీనర్ రాణి, వలంటీర్లు దివ్య, లక్ష్మి, నవీన్‌లతో కలిసి పంజాబ్ హోటల్ జంక్షన్ సమీపంలోని వైజాగ్ ప్రొఫైల్స్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సీఎం వైఎస్ జగన్ పాలనపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగనన్న స్టిక్కర్లు అతికించి, కరపత్రాలను అందించారు.

ఇంటింటికీ వెళ్లి..

జీవీఎంసీ 51వ వార్డు 289 సచివాలయం పరిధి మాధవధార-2లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, సచివాలయ కన్వీనర్ పైడి శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ పాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. నివాసుల అనుమతితో వారి ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో వలంటీర్లు లీలా, రాజేశ్వరి, భాషా, గృహసారథులు కదారి దుర్గమ్మ, రాజేశ్వరి, పార్టీ సీనియర్ కార్యకర్త సనపల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



మాధవధార-2లో తన ఇంటి గోడకు స్టిక్కర్ అతికిస్తున్న స్థానికురాలు

అపరిశుభ్రంగా కాలువలు



సీతంపేట హరిజన వీధిలోని కాలువలో పేరుకుపోయిన చెత్త

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సీతంపేట హరిజన వీధిలోని కాలువల్లో చెత్త తొలగించకపోవడంతో అపరిశుభ్రంగా తయారయ్యాయని స్థానికులు చెబుతున్నారు. 40 రోజులుగా కాలువల్లో చెత్తను తొలగించే సిబ్బంది తమ ప్రాంతానికి రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత సిబ్బంది, అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. పారిశుధ్య కార్మికులు, మేస్త్రీలు, శానిటేషన్ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఏఎంవోహెచ్ ఇలా అన్ని స్థాయిల్లో యంత్రాంగం ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం మెరుగైన పారిశుధ్యం కనిపించడం లేదు. ఒకప్పుడు వార్డు అంతా పర్యవేక్షించడానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఒక్కరే ఉండేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రతి మూడు వేల జనాభాకు ఒక శానిటేషన్ కార్యదర్శిని నియమించారు. ఈ లెక్కన ప్రతి వార్డుకు 5 లేదా 6గురు కార్యదర్శులు అందుబాటులోకి వచ్చారు. అయినా పారిశుధ్యం అమలు తీరు ఏమాత్రం మారలేదని స్థానికుల నుంచి వస్తున్న ఫిర్యాదులు తేటతెల్లం చేస్తున్నాయి. సంబంధిత అధికారులు దృష్టిసారించి క్షేత్రస్థాయిలో మెరుగైన పారిశుధ్యం అందేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణపై ద్వంద్వ వైఖరి తగదు



నరసింహనగర్ కూడలిలో ధర్నా చేస్తున్న వామనమూర్తి, ఇతర నాయకులు

సీతంపేట: కేంద్ర ఉక్కు సహాయక మంత్రి ఫగాన్ సింగ్ కులస్తే ద్వంద్వ వైఖరి విడనాడాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నరసింహనగర్ కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిలిపివేస్తామని, ప్లాంట్ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని ప్రకటించిన కేంద్ర మంత్రి.. సాయంత్రమయ్యే సరికి మాట మార్చేశారని మండిపడ్డారు. ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అని రెండేళ్లుగా చేస్తున్న నిరసనలు, ధర్నాలను విచ్ఛిన్నం చేయడానికే ఫగాన్ సింగ్ అటువంటి వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, ఐరన్‌ఓర్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రావికృష్ణ, కేలం శివ, కె.శ్రీను, పి.సాయికుమార్, జి.సూర్యారావు, డి.మహాలక్ష్మినాయుడు, బి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం వద్ద అర్చకుడు శేషాచార్యులు, వైభవుడి సేవకులు

మురళీనగర్: మురళీనగర్ సమీపంలోని ఎన్‌జీజీవోస్ కాలనీ బస్టాప్ వద్ద వైభవ వేంకటేశ్వరస్వామి సేవకులు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ బాటసారులకు వైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానం అర్చకుడు శేషాచార్యులు మజ్జిగ పంపిణీ చేశారు. వైభవుడి సేవకుడు నూకరాజు ఆర్థిక సాయం అందించారు. 108 రోజుల పాటు ఈ చలివేంద్రాన్ని కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.